క్లుప్తంగా

పరామర్శ..



పరామర్శిస్తున్న పువ్వాడ

ఖమ్మంఅర్బన్: ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన రాంక్యాతండాకు చెందిన మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ అఫ్జల్ కుటుంబాన్ని గురువారం మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ పరామర్శించారు. అఫ్జల్ చిత్రపటంపై పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఖమ్మం ప్రముఖ గ్రానైట్ వ్యాపారి వేముల రవి కుమారుడు పవన్ వివాహ మహోత్సవానికి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. టేకులపల్లికి చెందిన దొంగల నాగేశ్వరరావు ఇటీవల గుండెపోటుతో మృతి చెందగా దశదిన కార్యక్రమానికి హాజరై నివాళులర్పించారు. నగర అధ్యక్షులు పగడాల నాగరాజు, మండలాధ్యక్షులు వీరు నాయక్, బచ్చు విజయ్ కుమార్, దేవభక్తుని కిషోర్, సాయి ,గుత్తా రవి, పిన్ని కోటేశ్వరరావు, దొంతు సత్యనారాయణ, లక్ష్మణ్ నాయక్, తారాచంద్, శ్రీను, దడాల రఘు, తోట వీరభద్రం, దొంగల తిరుపతిరావు, పాపారావు పాల్గొన్నారు.

టీజేఎస్ జిల్లా కన్వీనర్‌గా రాజేందర్



ఖమ్మం మామిళ్లగూడెం: తెలంగాణ జన సమితి యువజన విభాగం జిల్లా కన్వీనర్‌గా ఖమ్మంకు చెందిన భట్టు రాజేందర్ నాయక్ నియమితులయ్యారు. ఈ మేరకు హైదరాబాద్‌లో టీజేఎస్ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు సయ్యద్ సలీం నియామక పత్రం అందజేశారు. జేఎస్ పార్టీలో విద్యార్థి దశ నుంచి సేవలను గుర్తించి పదవి ఇవ్వడంపై పలువురు అభినందించారు. ఈ సందర్భంగా భట్టు రాజేందర్ నాయక్ మాట్లాడుతూ... తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోపగాని శంకర్‌రావు, రాష్ట్ర అధ్యక్షుడు సయ్యద్ సలీంకు కృతజ్ఞతలు తెలిపారు.

రూ.9.70 కోట్ల రుణమాఫీ

నేలకొండపల్లి: టేకులపల్లి ఆంధ్రాబ్యాంక్ కర్షక పరపతి సహకార సంఘం పరిధిలో రూ.9.70 కోట్ల మాఫీ అందించినట్టు అధ్యక్షుడు బి.నాగవెల్లి చంద్రారెడ్డి తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన మాట్లాడుతూ.. బ్యాంక్ పరిధిలో 19 గ్రామాల పరిధిలో 4,244 మంది రైతులకు గాను, 1,440 మంది రైతులకు రుణమాఫీ పొందారన్నారు. ప్రభుత్వం ప్రకటించిన నిబంధనల మేరకు రైతులకు రుణమాఫీ అందినట్లు తెలిపారు. మండలంలోని గువ్వలగూడెం గ్రామంలో చనిపోయిన రైతుకు తమ బ్యాంక్ నుంచి మాఫీ పొందినట్లు వచ్చిన వార్తలలో నిజం లేదన్నారు. డైరెక్టర్ ఆర్.కిషన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు గ్రామాల్లో అవగాహన కల్పించాలి

ఖమ్మంసహకారనగర్: ఇటీవల మానవాళి ఎదుర్కొంటున్న అనారోగ్యాల్లో దోమలతో సంక్రమించే వ్యాధులు ఆందోళనకరమైనవిగా రూపాంతరం చెందాయని ఎస్ఆర్అండ్‌బీజీఎన్ఆర్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఏ.ఎల్.ఎస్.శాస్త్రి అన్నారు. గురువారం జువాలజీ విభాగం ఆధ్వర్యంలో 'దోమల ద్వారా సంక్రమించే వ్యాధులు- నివారణా మార్గాలు' అనే అంశంపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యాసరచన పోటీలను నిర్వహించారు. వానాకాలం దోమల ద్వారా విష జ్వరాలు వ్యాప్తి పట్ల విద్యార్థులు తమ గ్రామాల్లో అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో జువాలజీ విభాగాధిపతి డా.సునంద, సైన్స్ విభాగ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బానోత్ రెడ్డి, అధ్యాపకులు డా.శ్రీనివాస శరిన్, డా.చెంచురత్తయ్య, మైక్రో బయాలజీ విభాగాధిపతి డా.రేణుక, అధ్యాపకులు డా.సీతారాం పాల్గొన్నారు.

ధర్నాకు తరలిన నాయకులు

రఘునాథపాలెం: సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర మిటీ పిలుపులో భాగంగా రాష్ట్రంలో అర్హులైన నిరుపేదలకు తెల్లరేషన్ కార్డులు ఇవ్వాలని, పింఛన్లు మంజూరు చేయాలని, ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని కోరుతూ హైదరాబాద్‌లో జరుగుతున్న మహాధర్నాకు గురువారం మండలం నుండి పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. నాయకులు ఆవుల మగతాయి, పార్టీ మండల కార్యదర్శి కేలోత్ లక్ష్మణ్, ధరావత్ లక్ష్మణ్, జాటోత్ ప్రేమ్‌సింగ్, షేక్ మదర్ సాహెబ్, లింగన్న బోయిన నాగేశ్వరరావు, రామారావు, వెంకటరామయ్య, లచ్చు, ఆడెపు సత్యం, రమేష్, బానోతు, రాము, రవి, సుగుణమ్మ ఉన్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	డిమాంట్ కాలనీ 2
వినోద	ఆయ్
సాయిరాం	తంగలాన్
ఆదిత్య	మారుతి నగర్ సుబ్రహ్మణ్యం,
	కమిటీ కుర్రోళ్లు
శ్రీనివాస	డబుల్ ఇస్మార్ట్

- ఖమ్మం గాంధీచౌక్

అద్దె భవనంలోనే నెట్టుకొస్తూ..

అవస్థల నడుమ గురుకుల బాలుర పాఠశాల

- రూ.20 కోట్ల పనుల్లో 20 శాతమే పూర్తి
- రెండేళ్లు గడుస్తున్నా నత్తనడకన పనులు..





అసంపూర్తి నిర్మాణాలతో దర్శనమిస్తున్న గురుకుల పాఠశాల నిర్మాణ సముదాయం

రఘునాథపాలెం: వందలాది మంది విద్యార్థులకు విద్యనందించడానికి మండల కేంద్రంలో ప్రారంభించిన తెలంగాణ గిరిజన సంక్షేమ ప్రతిభా పాఠశాల, కాలేజి ప్రారంభం నుంచి అద్దె భవనంలో అవస్థల మధ్య నెట్టుకొస్తున్నారు. రెండేళ్ల క్రితం పాఠశాల సముదాయానికి పక్కా భవనాలు నిర్మాణానికి ప్రభుత్వ స్థలం కేటాయించింది. దాంట్లో రూ.20 కోట్ల అంచనాలతో నిర్మాణాలు ప్రారంభించారు. ప్రారంభించి రెండేళ్లు దాటుతున్నప్పటికీ 20 శాతం పనులు కూడా ఇప్పటికీ పూర్తి కాలేదని పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు వాపోతున్నారు.

ఇంకా పిల్లర్ల దశలోనే..

మండలకేంద్రంలోని గిరిజన సంక్షేమ ప్రతిభ పాఠశాలలో 450 మంది పేద విద్యార్థులకు విద్యనందించే విధంగా ఏర్పాటు చేశారు. ప్రస్తుతం 410 మంది పైగానే పాఠశాలలో ప్రస్తుతం విద్యార్థులు ఉన్నారు. కొన్నేళ్లుగా వందలాది మంది విద్యార్థులు ఉన్న పాఠశాల ఒక ప్రైవేట్ భవనంలో అరకొర సౌకర్యాలతో ఇబ్బందిపడుతూ నెట్టుకొస్తున్నారు. స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్(బాలుర) గురుకుల పాఠశాల, కళాశాల భవన సముదాయం పేరుతో ఎడ్యుకేషన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ (ఎస్‌టీడీఎఫ్) నిధులతో రూ.20 కోట్లతో మంజూరు చేసి 2022 ఏడాది మే 24న అప్పటి మంత్రులు శంకుస్థాపన చేశారు. ఇప్పటికే నిర్మాణ ప్రారంభించి రెండేళ్లు దాటుతుందని ఇంకా పిల్లర్లు, తదితర అసంపూర్తి నిర్మాణాలతో దర్శనమిస్తున్నాయి. విద్యార్థులకు చదువు, వసతిపరంగా, క్రీడా మైదానం తదితర అన్ని రకాలుగా అవకాశం కల్పించాలని కోట్లాది రూపాయలు కేటాయించితే నిర్మాణంలో నత్తనడకన సాగడంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. రూ 20 కోట్ల అంచనాలతో జీప్లస్ 1లో అకాడమిక్ బ్లాక్, జీప్లస్-2లో డార్మెట్, కిచెన్, 13 క్యాటర్ల నిర్మాణం చేయాల్సి ఉందని ఉపాధ్యాయులు తెలిపారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు ఈ పాఠశాల భవన సముదాయం నిర్మాణంపై దృష్టి సారించి వేగవంతంగా పనులు చేయించి విద్యార్థుల కష్టాలను తీర్చాలని కోరుతున్నారు.

కేజీబీవీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి



సభ్యత్వ నమోదు ప్రారంభిస్తున్న నాయకులు

ఖమ్మంరూరల్: కస్తూర్బా గాంధీ విద్యాలయం ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి పీఆర్‌టీయూ కృషి చేస్తుందని సంఘం జిల్లా అధ్యక్షుడు కొమ్మినేని అనిల్‌కుమార్ అన్నారు. పీఆర్‌టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని గురువారం మండలంలోని కొత్తూరులో కేజీబీవీలో ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పదేళ్ల నుంచి ఉద్యోగ భద్రత లేక సరిపోను వేతనం రాక, బదిలీలు, సెలవులు వర్తించక అనేక ఇబ్బందులు పడుతున్న ఎస్‌ఓలు, సీఆర్‌టీలకు సంఘం రాష్ట్ర నాయకత్వం కృషి మేరకు బదిలీల షెడ్యూల్ విడుదలైందన్నారు. కనీస వేతనం ఇప్పించేందుకు సంఘం తరపున కట్టుబడి ఉన్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సురేష్, చావా శ్రీదేవి, ఆసిఫా, నాగమణి, రామయ్య పాల్గొన్నారు.

జానపద దినోత్సవ వేడుకలు



కేక్ కట్ చేస్తున్న జానపద కళాకారులు

ఖమ్మంగాంధీచౌక్: ప్రపంచ జానపద దినోత్సవ వేడుకలు గురువారం నగరంలోని పెవిలియన్ గ్రౌండ్‌లో జానపద కళాకారులు జరుపుకున్నారు. ఈ సందర్భంగా కళాకారుల జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. ఈ సంఘ ప్రతినిధులు మాట్లాడుతూ.. కనుమరుగవుతున్న జానపద కళలను బతికించాలని, అర్హులైన కళాకారులను ప్రభుత్వం గుర్తించి ఉద్యోగాలను కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు పోలూరి రాము, పమ్మి రవి, సతీష్, నంద్యాల నాగేశ్వరరావు, గురువయ్య, నరసింహారావు, శ్రీకాంత్, విజయ్, హిందూజైన్, శివ తదితరులు పాల్గొన్నారు.

షోయబుల్లాఖాన్ వర్ధంతి

తిరుమలాయపాలెం: తెలంగాణ తొలితరం కవి, విమర్శకుడు, పత్రికా సంపాదకుడు, ఇమ్రోజ్ ఉర్దూ పత్రిక వ్యవస్థాపకులు షోయబుల్లాఖాన్ వర్ధంతి సందర్భంగా గురువారం మండలంలోని సుబ్లేడు గ్రామంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వశపొంగు వీరన్న, గండమల్ల సుందరు, కామల్ల వీరయ్య, పోలెపొంగు బాలరాజు, గుంజ యలమంద, పోలెపొంగు వీరస్వామి, కంచం వీరన్న, దామల్ల సుధాకర్, గంధిరి సత్యం, వశపొంగు గురవయ్య, ఉపేందర్, వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం

ఖమ్మంగాంధీచౌక్: సినీ నటుడు చిరంజీవి జన్మదినం సందర్భంగా నగరంలోని శ్రీనివాస థియేటర్‌లో అభిమానులు కేక్ కట్ చేసి సందడి చేశారు. ప్రధాన ప్రభుత్వాస్పత్రిలో మాతృ శిశు ప్రాంగణంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. చిరంజీవి యువత జిల్లా అధ్యక్షుడు వీరేష్ గౌడ్, ప్రతినిధులు ఎండి.సాధిక్ అలీ, గంగిశెట్టి శ్రీనివాస్, సూరజ్, మహేష్, రామ్‌చరణ్, విజేత, మహేష్, లక్ష్మణ్, నర్సింహారావు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం



పాలాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఖమ్మంరూరల్: రైతులకు రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేసినందుకు హర్షిస్తూ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు గురువారం మండలంలోని వరంగల్ క్రాస్ రోడ్డులో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా నాయకులు రామిశెట్టి రమేష్ మాట్లాడుతూ... ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రైతులకు రుణమాఫీ చేయడం జరిగిందని, మాఫీకాని వారికి కూడా వందకు వంద శాతం చేస్తామని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ కొంతమంది కావాలనే ప్రభుత్వంపై బురద చల్లే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీను, బత్తిని యాలాద్రి, వెంకన్న, అంజి, కె.రాజు, సురేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ పర్యటన..



వధూవరులతో ఎంపీ రఘురాంరెడ్డి

తిరుమలాయపాలెం/కూసుమంచి: ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి గురువారం తిరుమలాయపాలెం, కూసుమంచి మండలాల్లో విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా వివాహ వేడుకలకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. అదేవిధంగా పాతర్లపాడులో ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌ను ప్రారంభించారు. నాయకులు చావా శివరామకృష్ణ నాయకులు జడల నగేష్ గౌడ్, ఉన్నం రాజశేఖర్, జడల రమేష్, మహేష్, షేక్ సైదా, పత్తి నాగేశ్వరరావు, తాటికొండ కిరణ్, చీకటి శ్రీను, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

బాలగణపతి ఆలయంలో పూజలు

ఖమ్మంఅర్బన్: నగరంలోని ఇందిరానగర్ ప్రధాన సెంటర్‌లోని బాలగణపతి ఆలయంలో గురువారం సంకటహర చతుర్థి సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో ప్రధానార్చకుడు గిరి ఆధ్వర్యంలో అభిషేక పూజలు జరిగాయి. అధ్యక్ష, కార్యదర్శులు బాజిన్ని వీరయ్య, తిరుపతిరావు పాల్గొని భక్తులకు దాతలు నాగేశ్వరరావు, భరద్వాజ్, తేజస్వినిలు అందించిన అల్పాహారం, తీర్థప్రసాదం పంపిణీ చేశారు.

వ్యర్థాల తొలగింపు



డ్రెయినేజీని శుభ్రం చేస్తున్న డీఆర్‌ఎఫ్ సిబ్బంది

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలో గురువారం కురిసిన వర్షానికి ఐటీ హబ్ ప్రాంతంలో రోడ్లపై మోకాళ్లోతు మేరకు నీరు నిలిచింది. వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలిగడంతో డీఆర్‌ఎఫ్ సిబ్బంది వచ్చి డ్రెయినేజీల్లో పేరుకు పోయిన వ్యర్థాలను తొలగించారు.

షరతులు లేని రుణమాఫీ చేయాలి



మాట్లాడుతున్న నున్నా నాగేశ్వరరావు

ఖమ్మంమయూరిసెంటర్: ఎలాంటి షరతులు లేకుండా రైతు రుణమాఫీని చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. నగరంలోని సుందరయ్య భవనంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ. రైతు రుణమాఫీ రాజకీయ రంగు పులుముకుని సీఎం రేవంత్ రెడ్డి, మాజీ మంత్రి హరీశ్‌రావు నడుమ సవాళ్లు ప్రతి సవాళ్లకు దారితీసిందన్నారు. రైతులకు ఎవరి రాజీనామాలతో అవసరం లేదని, ఇచ్చిన హామీ మేరకు రుణమాఫీ చేస్తే చాలన్నారు. తెల్లరేషన్‌కార్డు నిబంధన ఎత్తివేయాలని, రూ.2 లక్షల పైనున్న మొత్తాన్ని చెల్లించకుండానే మాఫీ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. రుణమాఫీపై ఈనెల 27న రైతుసంఘాలు కలెక్టరేట్ల ఎదుట నిర్వహించే ధర్నాకు సీపీఎం మద్దతు ఇస్తున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు రూ.22వేల కోట్లు మాఫీ అయినట్లు సీఎం అబద్ధపు ప్రకటన చేశారని ఆరోపించారు. రూ.2లక్షలకు పైనున్నా అంత వరకు మాఫీ చేస్తామన్న ప్రభుత్వం ఇప్పుడు ఆ పైనున్న డబ్బులు కట్టమని ఒత్తిడి చేస్తోందన్నారు. ప్రభుత్వం ఆలస్యంగా నిధులు జమ చేయడం వల్ల రైతులు లబ్ధి పొందలేకపోతున్నారన్నారు. కాబట్టి షరతులు లేకుండా ఆలస్యం కాకుండా రుణమాఫీ వర్తింపజేయాలన్నారు. ఈ సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు యర్రా శ్రీకాంత్, వై.విక్రమ్ పాల్గొన్నారు.

విరివిగా మొక్కలు నాటుదాం..



కామేపల్లి: మొక్క నాటుతున్న అధికారులు



నేలకొండపల్లిలో..

కామేపల్లి: ప్రతి ఒక్కరూ విరివిగా మొక్కలు నాటాలని ఎంపీడీఓ రవీందర్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో 'నాటుదాం ఒక చెట్టు అమ్మ పేరు మీద' కార్యక్రమంలో భాగంగా మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.. భవిష్యత్ తరాలను ఆరోగ్యమైన వాతావరణాన్ని అందించేందుకు బాధ్యతగా మొక్కలను నాటి సంరక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ శ్రీరాణీ, భాస్కర్, బాషిసింగ్, కుమార్, సుప్రియ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నేలకొండపల్లి: మొక్కలు నాడటమే కాకుండా వాటిని సంరక్షించాలని ఎంపీడీఓ యం.యర్రయ్య అన్నారు. మండలకేంద్రంలోని మేజర్ పంచాయతీలో 'నాటుదాం ఒక చెట్టు.. అమ్మ పేరు మీద' అనే కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణ ప్రతీ ఒక్కరి బాధ్యత అని, ప్రతీ పంచాయతీ పచ్చటి చెట్లతో ఆహ్లాదకరమైన వాతావరణం ఉండేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈజీఎస్ ఏపీవో ఆర్.సునీత, ఈసీ శేషగిరిరావు, పంచాయతీ కార్యదర్శి దేవేందర్ పాల్గొన్నారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ పథకం క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్గో సర్వీస్ పాయింట్ ప్రారంభం



ప్రారంభోత్సవంలో నాయకులు, అధికారులు

కూసుమంచి: మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఆర్టీసీ కార్గో సర్వీస్ పాయింట్‌ను గురువారం కాంగ్రెస్ నాయకులు ఎండి.హఫీజుద్దీన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయనతో పాటు టీపీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి కొరివి వెంకటరత్నం మాట్లాడుతూ.. ఆర్టీసీ ఆధ్వర్యంలో సరుకు రవాణాను సులభతరం చేయటం సంతోషకరమన్నారు. ఈ అవకాశాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆర్టీసీ కార్గో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ వీరభద్రం మాట్లాడుతూ.. తమ సంస్థ ద్వారా రెండు రాష్ట్రాల్లోని అన్ని పట్టణాలతో పాటు మహారాష్ట్ర, కర్నాటక రాష్ట్రాల్లోని ముఖ్య పట్టణాల్లో సరుకు రవాణా చేయటం జరుగుతుందన్నారు. కో-ఎగ్జిక్యూటివ్ ఉపేందర్, ఏజెంట్ సైదులు, లక్ష్మణ్, నాయకులు చిన్నం సంగయ్య, బెల్లకొండ కిరణ్ పాల్గొన్నారు.

సన్మానం



సీతారాంరెడ్డిని సన్మానిస్తున్న రైతులు

తిరుమలాయపాలెం: కలెక్టర్ ముజిమ్మిల్‌ఖాన్ చేతుల మీదుగా ఉత్తమ ప్రతిభ పురస్కారం అందుకున్న మండల వ్యవసాయాధికారి నారెడ్డి సీతారాంరెడ్డిని రైతులు మండలకేంద్రంలోని వ్యవసాయ శాఖ కార్యాలయంలో గురువారం సన్మానించారు. రైతులు గంటా కృష్ణ, వెంకటేశ్వర్లు, శ్రీనివాసరావు, నాగభూషణం, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన ఉండాలి

నేలకొండపల్లి: సీజనల్ వ్యాధులపై ప్రజలు అవగాహన ఉండాలని మండల పంచాయతీ అధికారి సిహెచ్.శివ సూచించారు. మండలంలోని కోనాయిగూడెం, రాజేశ్వరపురం పంచాయతీలలో గురువారం అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీజనల్‌లో వచ్చే వ్యాధులను దరిచేరనీయకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ప్రజలను చైతన్యం చేసేందుకు సమాఖ్య సభ్యులు చొరవ తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐకేపీ ఏపీయం కె.అశోక్‌రాణి, పంచాయతీ కార్యదర్శులు బొల్ల వీరబాబు, చిరంజీవి, గ్రామదీపిక కొమ్మినేని పుష్పావతి, అంగన్‌వాడీ టీచర్ వడ్లమూడి నాగమణి, ఆశ కార్యకర్త చెరుకుపల్లి బేబి, వీవో సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ కాలేజీ సెక్యూరిటీ రూం ప్రారంభం



సెక్యూరిటీ షెడ్డును ప్రారంభిస్తున్న దృశ్యం

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలోని 41వ డివిజన్ మెడికల్ కాలేజీ మెయిన్ గెట్ వద్ద సెక్యూరిటీ షెడ్‌ను డివిజన్ కార్పొరేటర్ కర్నాటి క్రిష్ణ గురువారం ప్రారంభించారు. కళాశాల ప్రిన్సిపాల్ సుంకర రాజేశ్వరరావు సతీమణి స్వర్ణలత జ్ఞాపకార్థం సెక్యూరిటీ షెడ్ నిర్మాణం చేపట్టారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సి.సరిత, వైస్ ప్రిన్సిపాల్, డాక్టర్ కె.సుజనాగౌడ్, ఆర్.మురళి కృష్ణ, ఎం.పృథ్వీరాజ్, యడ్లపల్లి నవీన్ కుమార్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ రుణమాఫీ వర్తింపజేయాలి



ఖమ్మంరూరల్: ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ఖమ్మంరూరల్: ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిన విధంగా రూ. 2లక్షల వరకు ఉన్న రుణాలను ఎలాంటి షరతులు లేకుండా అర్హులైన రైతుఅందరికీ రుణమాఫీ చేయాలని, రైతు భరోసా డబ్బులు చెల్లించాలని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు బెల్లం వేణు అన్నారు. గురువారం పార్టీ పిలుపులో భాగంగా ఎంపీడీఓ కార్యాలయం ఎదుట బీఆర్ఎస్ నాయకులు ధర్నా చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మట్టా వెంకటేశ్వరరావు, వెంకట్రామయ్య, పుల్లయ్య పాల్గొన్నారు.

కూసుమంచి: ఎలాంటి షరతులు లేకుండా రుణమాఫీని చేయాలని డిమాండ్ చేస్తూ కూసుమంచిలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రదర్శన నిర్వహించారు. అనంతరం ఏఓ వాణికి వినతిపత్రాన్ని అందజేశారు. పార్టీ మండల అధ్యక్షుడు వేముల వీరయ్య, ప్రధాన కార్యదర్శి ఆసిఫ్‌పాషా పాల్గొన్నారు.

కామేపల్లి: స్థానిక తహసీల్ ఎదుట బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి తహసీల్దార్ సుధాకర్‌కు వినతిపత్రం అందజేశారు. నాయకులు మూడ్ కృష్ణప్రసాద్‌నాయక్, కాత్రాల రాంబాబు, చిప్పలపల్లి శ్రీనివాసరావు, ఆదూరి ప్రసాద్, పుచ్చకాయల బాబు, ఉదయ్, ధరావత్ నాగేశ్వరరావు, బానోత్ గోపీచంద్, కిషన్, భూక్యా రాంజీ పాల్గొన్నారు.

నేలకొండపల్లి: రుణమాఫీ ఎలాంటి షరతులు లేకుండా చేయాలని కోరుతూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో నిరసన కార్యక్రమం చేపట్టి తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం చేశారు. అనంతరం ఏఓకు వినతిపత్రం అందించారు. మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ మరికంటి ధనలక్ష్మి, సీడీసీ మాజీ చైర్మన్ నెల్లూరి లీలాప్రసాద్, డీసీఎంఎస్ డైరెక్టర్ నాగుబండి శ్రీనివాసరావు, భూక్యా సుధాకర్, వడ్లమూడి సంపత్, శ్రీనివాసరావు, రవి, వెంకటలక్ష్మి, భాస్కర్, కాంతారావు, భాస్కర్‌రెడ్డి, నేర్లల నరసింహారావు, తేజావత్ శంకర్ తదితరులు పాల్గొన్నారు

తిరుమలాయపాలెం: రైతువ్యతిరేక విధానాలను నిరసిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. మండల వ్యవసాయాధికారి సీతారాంరెడ్డికి వినతి పత్రం అందజేశారు. పార్టీ మండలాధ్యక్షుడు బాషబోయిన వీరన్న, ఆర్మి రవి, తాత రవీందర్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.



కామేపల్లి: వినతిపత్రం అందజేస్తున్న నాయకులు



కూసుమంచిలో..



తిరుమలాయపాలెంలో..

చెరువును తలపిస్తున్న పాఠశాల



పాఠశాలలో నిలిచిన నీటిని మళ్లించే ప్రయత్నం చేస్తున్న సిబ్బంది

నేలకొండపల్లి: కొద్దిపాటి వర్షానికి పాఠశాల చెరువును తలపిస్తున్నాయి. మండలంలోని మంగాపురం తండా పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలు ఒకే ఆవరణలో ఉన్నాయి. గురువారం తెల్లవారుజామున కురిసిన వర్షానికి పాఠశాల ఆవరణ మొత్తం నీరు నిలిచింది. తరగతి గదులకు నీళ్లు చేరే విధంగా నీరు నిలిచింది. పాఠశాలకు సెలవు ప్రకటించటంతో విద్యార్థులు పాఠశాలకు రాలేదు. పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాల్లో నీరు నిలిచిన వైనంపై గ్రామస్తులు ఆగ్రహించారు. మండల అధికారులకు ఫిర్యాదు చేయటంతో పంచాయతీ కార్యదర్శి మహేష్ సిబ్బందితో పాఠశాలలో నిలిచిన నీటిని బయటకు తీయించేందుకు చర్యలు చేపట్టారు. చిన్నపాటి వర్షం వచ్చినా నీరు నిలుస్తుందని, వెంటనే ఆవరణలో మొరం తొలగించి ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.